ఏళ్లుగా ఎదురుచూపులే..!

- గంగాపూర్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో?
- టెండరు పూర్తయినా ప్రారంభం కాని పనులు
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు



బుగ్గారం-గంగాపూర్ గ్రామాల మధ్య మట్టిరోడ్డు(ఫైల్)

బుగ్గారం: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది బుగ్గారం- గంగపూర్ గ్రామాల మధ్య రోడ్డు పరిస్థితి. 2015లో రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసినా రోడ్డు నిర్మాణం మాత్రం ఇంకా పూర్తికావడం లేదు. తమ గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. బుగ్గారం నూతన మండలంగా ఏర్పాటయ్యే సందర్భంలో తమ గ్రామం నుంచి బుగ్గారం మండల కేంద్రానికి రావడం ఎంతో ఇబ్బందిగా ఉంటుందని, తమ గ్రామాన్ని గొల్లపల్లి మండలంలోనే కొనసాగించాలని ప్రజలు నిరసన తెలిపారు. రాకపోకల పరంగా తమకు సరైన రహదారి సౌకర్యం లేదని నూతన మండలంలో కలవడానికి ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి చేరుకోవడానికి నేరుగా రహదారి సౌకర్యం కల్పించి గంగాపూర్, యశ్వంతరావుపేట గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ముందుగా మట్టి రోడ్డు నిర్మాణం కోసం 2015లో శంకుస్థాపన చేశారు. అనంతరం కొంతకాలానికి మట్టి రోడ్డు పూర్తయింది. అయినప్పటికీ గంగాపూర్-యశ్వంతరావుపేట గ్రామాల మధ్య వాగు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో గంగాపూర్ నుంచి బుగ్గారం వరకు బీటీ రోడ్డును నిర్మించడంతో పాటు వాగుపై బ్రిడ్జిని సైతం నిర్మించడానికి 3.6 కోట్ల సీఆర్ఆర్ నిధులతో 2018లో మరోసారి శంకుస్థాపన చేశారు.

పూర్తయిన బ్రిడ్జి..

గతంలో గంగాపూర్ ప్రజలు బుగ్గారం చేరుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసాలు పడాల్సి వచ్చేది. ముఖ్యంగా వానాకాలంలో గ్రామశివారులోని వాగును దాటి బుగ్గారం చేరుకోలేక ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మండల కేంద్రానికి వచ్చేవారు. ఈ నేపథ్యంలో ముందుగా బ్రిడ్జి అవసరాన్ని గుర్తించి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో వానాకాలంతో పాటూ అన్ని సమయాల్లో రాకపోకలకు మార్గం ఏర్పడింది.అయినప్పటికీ బీటీ రోడ్డు లేకపోవడంతో ఆటోలు,బస్సులు నడవడం లేదు.దీంతో కేవలం ప్రైవేటు వాహనదారులు మాత్రమే ఈ మార్గం గుండా వెళ్తున్నారు.

బీటీ రోడ్డు పూర్తయితే మరింత సౌకర్యం..

రాకపోకలు పెరుగుతాయి.ఆటోలు,ఇతర వాహనాలు వెళ్లే వీలుంటుంది. ప్రజలకు రవాణపరంగా ఎంతో సౌకర్యవంతంగా మారుతుంది. ఇతర మార్గాల ద్వారా వ్యయప్రయాసాల కోర్చి మండల కేందానికి రావడం తప్పుతుంది. దీంతో పాటు గణనీయమైన దూరభారం తప్పుతుంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బుగ్గారం నుంచి గంగాపూర్ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఎంతో సౌకర్యం



బుగ్గారం-గంగాపూర్ గ్రామాల మధ్యన రోడ్డు నిర్మాణం పూర్తయితే మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.రాకపోకలు సులభతరం అవుతాయి.కల్లెడ మీదుగా తిరిగి వెళ్లడం తప్పుతుంది. ముఖ్యంగా ప్రయాణికులకు, వాహనదారులకు దూరభారం తప్పుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– ఖలీల్,బుగ్గారం

రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి



మండల కేంద్రం నుంచి గంగాపూర్ వరకు రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. మంత్రి కొప్పుల ప్రత్యేక చొరవతో బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తయింది. అలాగే బీటీ రోడ్డును పూర్తి చేస్తే బుగ్గారం,యశ్వంతరావుపేట,గంగాపూర్ గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

– రత్నయ్య,యశ్వంతరావుపేట

త్వరలోనే పనులు ప్రారంభం



మండల కేంద్రం బుగ్గారం నుంచి యశ్వంతరావుపేట మీదుగా గంగాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.టెండరు కూడా పూర్తయింది.కొన్ని సాంకేతిక కారణాల వలన పనుల్లో ఆలస్యం జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. సకాలంలో రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్‌రావు, పీఆర్,డీఈఈ

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం: కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కోరుట్లలో జువ్వాడి నర్సింగరావు ఓడిపోవడం బాధగా అనిపిస్తుందని, ఓడిపోవడానికి కారణంపై సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. 15 ఏళ్లుగా పోరాటం చేశామని ప్రజలు, రైతులు చక్కెర ఫ్యాక్టరీని మూసివేసిన వారికే ఓట్లు వేశారన్నారు. ప్రజలకు 5 ఏళ్ల పాటు అందుబాటులో ఉండి సమస్యలపై తీవ్రంగా పోరాడామని, మాజీ ఎమ్మెల్యే అవినీతిపై ప్రజలకు వివరించామన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, తెలంగాణ జనసమితి పార్టీ నాయకులు చింతకుంట శంకర్, కంతి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

మెట్‌పల్లిరూరల్: కాంగ్రెస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, నిరాశకు గురికావొద్దని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండలం మేడిపల్లిలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయని ఆరా తీసిన ఆయన, ఓటమి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం త్వరలోనే ఏర్పాటు కాబోతుందని తెలిపారు. కార్యకర్తలు ప్రజల మధ్యే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్,లింగారెడ్డి, మారుతి పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పెగడపల్లి: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నూతన ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు విజయభాస్కర్, తిరుపతి, సతీశ్‌రెడ్డి, ప్రవీన్, ప్రశాంత్, మహేశ్, కిషన్, అంజయ్య, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి నియామకంపై హర్షం

మెట్‌పల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధిష్టానం రేవంత్‌రెడ్డిని నియమించడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి కృషి చేసిన రేవంత్‌కు అధిష్టానం సముచిత స్థానం కల్పించిందని పేర్కొన్నారు.

భారత్ సురక్షా సమితి సంబరాలు



సంబరాల్లో భారత్ సురక్షా సమితి నేతలు

జగిత్యాలటౌన్: మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో బీజేపీ విజయం సాధించడంతో భారత్ సురక్షా సమితి ప్రతినిధులు ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. జగిత్యాల తహసీల్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో మోదీ మూడో సారి ప్రధాని అవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, సంఘం ప్రతినిధులు బాసెట్టి ప్రభాకర్, మోటకాడి మోహన్‌రెడ్డి, లింగాల శ్రీకాంత్‌రావు, మాడిశెట్టి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్ గెలుపుపై సంబరాలు



మేడిపల్లిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందటంతో మేడిపల్లి మండల వ్యాప్తంగా మున్నూరు కాపు సంఘం నాయకులు మంగళవారం మండలంలోని వల్లంపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. బహుజనుడు, బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సుతారి బుచ్చిరెడ్డి, సాయిని గంగారెడ్డి, నారాయణ, రాజారెడ్డి, దేవరాజం, మల్లేశం, అశోక్, రాము, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

51వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ



బీర్‌పూర్ సహకార సంఘ పరిధిలో ధాన్యం కొనుగోలు

పెగడపల్లి: మండలంలోని నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మంగళవారం వరకు రైతుల నుంచి 38 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు చైర్మన్ వేణుగోపాల్, సీఈవో మధుకర్ తెలిపారు.

సారంగాపూర్: బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో13,800 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు సంఘం సీఈవో అయ్యోరి తిరుపతి తెలిపారు. మరో 15వేల క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పల్లె ప్రకృతివనం పరిశీలన



పల్లె పకృతి వనం పరిశీలిస్తున్న డీపీవో

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ మంగళవారం పర్యటించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం , వన నర్సరీని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు వాడల్లో పర్యటించి పారిశుధ్యం పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీవో ఎం.డీ తౌఫిర్‌అహ్మద్, కార్యదర్శి అరుణ ఉన్నారు.

పోతారంలో డీఎల్పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్పీవో శంకర్

కథలాపూర్: మండలంలోని పోతారంలో కోరుట్ల డీఎల్పీవో శంకర్ మంగళవారం విచారణ చేపట్టారు. ఓ ఇంటి నిర్మాణం విషయంలో గత నెలలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్పీవో శంకర్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఇరువర్గాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మపురి జలంధర్, ఎంపీటీసీ పులి శిరీష, ఉపసర్పంచ్ పాలెపు లత, కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న ఏపీఎం

జగిత్యాలరూరల్: తేమశాతం వచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తక్కళ్లపల్లి, గుల్లపేట,గామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తాము తెచ్చే వరిధాన్యాన్ని తేమ శాతం చూసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీసీ మంగ, వీవోఏలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయ బోర్డు మెంబర్ రాజీనామా



ఈవోకు రాజీనామా పత్రం ఇస్తున్న ప్రవీణ్

కొండగట్టు: మల్యాల మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పోచమల్ల ప్రవీణ్ కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ బోర్డు మెంబర్ పదవికి మంగళవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వంలో కేటాయించిన నామినేటెడ్ పదవిలో కొనసాగడం తగదని రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా పత్రంను ఈవో వెంకటేశ్‌కు అందజేశారు.

అకాల వర్షాలతో రైతుల ఆందోళన



ధాన్యం తడవకుండ కవర్లు కప్పుకున్న రైతులు

ఇబ్రహీంపట్నం: తుఫాన్ ప్రభావంతో మండలంలో వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యం తడువకుండా కవర్లు కప్పి కాపాడుకుంటున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

సా..గుతున్న ధాన్యం కొనుగోళ్లు

- ధాన్యంపై దళారుల కన్ను
- కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్న వైనం
- మాములు(ళ్లు)గా తీసుకుంటున్న నిర్వాహకులు



కొనుగోలు కేంద్రంలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు

మల్లాపూర్: దళారులను నమ్మి పోసపోవద్దని ఓ వైపు ప్రభుత్వం సహకార, ఐకేపీ(సెర్ప్) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. ఆ కేంద్రాల నిర్వాహకుల అలసత్వం, కమీషన్లపై ఆశతో పట్టనట్లు వ్యవహరించడంతో దళారులు ఏకంగా ఆ కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా మల్లాపూర్ మండలంలోని గోదావరితీర ప్రాంతాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో యథేచ్ఛగా జరుగుతున్నా.. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు కేంద్రాలకు తీసుకవస్తే నిర్వాహకులు కొనుగోలు చేయకుండా తప్ప, తాలు, తేమ అంటూ రోజుల తరబడి వేచిచూసే ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో వర్షం పడి ధాన్యం తడిసి దిగుబడి నష్టం వస్తుందని భయాందోళనకు గురవుతున్న కొంతమంది రైతులు కేంద్రాల వద్దకే వస్తున్న దళారులకు మద్దతు ధర కంటే రూ.100–150 తక్కువకే అమ్ముకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని గుర్తించడంతో పాటు కేంద్రల్లోకి వచ్చి కొనుగోలు చేస్తున్న దళారులపై, సహకరిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామన్నపేట విద్యార్థి



గ్రీష్మంత్

మల్యాల: మల్యాల మండలం రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి బండారు గ్రీష్మంత్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజగోవింద రెడ్డి, పీఈటీ విద్యాసాగర్ తెలిపారు. ఉమ్మడి కరీంగనర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలుర విభాగంలో 3 కిలోమీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం



ఆర్థికసాయం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆవుల లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతుండగా, బాధిత కుటుంబాన్ని లయన్స్‌క్లబ్ రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్‌తో కలిసి పరామర్శించి రూ.7 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం, లయన్స్ క్లబ్ సభ్యులు ముత్యాల రమేశ్, మోర సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటు

మెట్‌పల్లి: పట్టణంలోని 15వార్డు పద్మశాలీ సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేతు లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బొప్పరాతి శివరాం, జోగ మనోహర్, ఆడెపు నారాయణ, ప్రధాన కార్యదర్శులుగా బేతు ప్రసాద్, బొప్పరాతి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా బండి రవిని సభ్యులు ఎన్నుకున్నారు.

చిత్ర కథ ఈ కష్టాలు ఇంకెన్నాళ్లో..?



వెల్గటూర్: మండలంలోని శాఖాపూర్, ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు వీలుగా రెండు గ్రామాల మధ్య ఉన్న వాగుపై నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనులు నత్తనడకనా సాగుతున్నాయి. సుమారు రెండేళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పూర్తి కాని వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని మాసాయిపేటలో శ్రీ కేతలమ్మ-మేడాలమ్మ సమేత మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 7న విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా మంగళవారం డప్పు చప్పుళ్లు, డోలు విన్యాసాల మధ్య మంగళహారతులతో విగ్రహాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. విగ్రహాల ఊరేగింపునకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయికల్‌లో నేడు అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

రాయికల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఆరట్టు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు మునుగోటి సత్యనారయణశర్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయం నుంచి శోభాయాత్రగా ప్రారంభమై రాయికల్ పెద్ద చెరువులో స్వామివారికి చక్రస్నానం, అభిషేకాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.